RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

బూర నగేష్ గౌడ్
ఎడిటర్


మండలాలవారీగా
విలేకరులు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యత
ఐడి కార్డు, ట్యాగ్, లోగో, వెహికల్ స్టిక్కర్స్ ఇవ్వబడును
ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు
94419 74025
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

www.nityamnigha.com
RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

NITYAM NIGHA TELUGU DAILY
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

Published From : Warangal
Circulated at : Telangana All Districts



వరంగల్ | సంపుటి 2 | సంచిక 103 | ఎడిటర్ - బూర నగేష్ గౌడ్ | గురువారం | 15.10.2026 | పేజీలు : 8

భారత అంతర్గత విషయాలు మీకెందుకు?:
అమెరికన్ సింగర్‌కు అభిజిత్ దీపేకి కౌంటర్

- సీజేపీకి అమెరికా నుంచి నిధులు వస్తున్నాయన్న గాయని మేరీ మిల్బెన్
- ఆరోపణలను ఖండించిన సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీపేకి
- మా అంతర్గత విషయాల్లో విదేశీయుల జోక్యం ఎందుకని ఫైర్
- సీజేపీకి వ్యతిరేకంగా నిరసనలు చేయాలని భారత యువతకు మిల్బెన్ పిలుపు



2

సినిమా చూస్తూ డ్రైవింగ్..
ఆటో డ్రైవర్‌పై వీసీ సజ్జనార్ సీరియస్

- డ్రైవింగ్ చేస్తూ సినిమా చూస్తున్న ఆటో డ్రైవర్ వీడియోపై వీసీ సజ్జనార్ స్పందన
- ఇది క్షమించరాని నేరం, నడుస్తున్న మృత్యుశకటం అంటూ తీవ్ర ఆగ్రహం
- ప్రమాదకర డ్రైవింగ్ కింద భారీ జరిమానా, లైసెన్స్ రద్దు తప్పదని హెచ్చరిక



2

మీరట్ బ్లూ డ్రమ్ హత్య కేసులో సంచలన తీర్పు..
భార్య, ప్రియుడికి మరణశిక్ష!

- నేవీ అధికారి సౌరభ్ రాజ్‌పుత్ హత్య
- మృతదేహాన్ని సిమెంట్ నింపిన డ్రమ్‌లో దాచిన నిందితులు
- 22 మంది సాక్షుల వాంగ్మూలాల పరిశీలన
- ఫోన్ రికార్డులు, ఇతర ఆధారాలతో కేసు నిరూపణ



2

హైదరాబాద్‌లో సమాఖ్య బిజినెస్ సమ్మిట్..

- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను చేస్తామన్న సీఎం
- దేశ జీడీపీలో రాష్ట్ర వాటాను 10 శాతానికి పెంచడమే లక్ష్యమని వెల్లడి
- కేవలం ఎన్నికల సమయంలోనే రాజకీయాలని వ్యాఖ్య

రాష్ట్రాభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు



నిత్యం నిఘా, హైదరాబాద్ : 2047వ సంవత్సరం నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఈరోజు 'సమాఖ్య బిజినెస్ సమ్మిట్-2026'ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ఆర్థిక ప్రగతిపై తమ ప్రభుత్వ దార్శనికతను వివరించారు. ఈ భారీ లక్ష్య సాధనలో భాగంగా 2034 నాటికి రాష్ట్రాన్ని 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేస్తామని రేవంత్ రెడ్డి తెలిపారు. 2047 నాటికి 'వికసిత్ భారత్' సాధించాలన్న ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యానికి అనుగుణంగా రాష్ట్ర ప్రగతి ప్రణాళికలు ఉన్నాయని, ఈ లక్ష్య సాధనకు కేంద్ర, రాష్ట్రాల సహకారం అవసరమని అన్నారు. ఎన్నికలప్పుడే రాజకీయాలని...

మిగతా 2 వ పేజీ లో..



కమిషన్ల కోసమే సింగరేణిని దోచుకుంటున్నారు
: రేవంత్ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్

- వాటాలు తేలకపోవడం వల్లే నైని టెండర్లు రద్దు చేశారని విమర్శ
- సైట్ విజిట్ సర్టిఫికెట్ పేరుతో రూ.10,000 కోట్ల కుంభకోణం జరిగిందన్న కేటీఆర్
- సింగరేణి అక్రమాలపై ఆధారాలతో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాశామని వెల్లడి

2

భారత్‌పై ఐఎస్ఐ 'డిజిటల్ జిహాద్'
నిరసనలే లక్ష్యంగా 5వేల ఫేక్ అకౌంట్లతో కుట్ర!



- గత రెండు వారాల్లోనే 5వేలకు పైగా ఫేక్ సోషల్ మీడియా ఖాతాల సృష్టి
- 'సర్' నిరసనలను ఆసరాగా చేసుకుని హింసను ప్రేరేపించేందుకు కుట్ర
- కొత్త పంథాలో ఐఎస్ఐ.. చిన్న పట్టణాల నుంచి ఫేక్ న్యూస్ వ్యాప్తి
- కొందరు భారతీయులకు డబ్బులిచ్చి దేశ వ్యతిరేక ప్రచారం

2

దసరాకు టీజీఎస్ఆర్టీసీ భారీ ఏర్పాట్లు..
7 వేల ప్రత్యేక బస్సులు సిద్ధం



- ఈ నెల 20 వరకు అందుబాటులో ప్రత్యేక సర్వీసులు
- ఆరు కీలక తేదీల్లో స్పెషల్ బస్సుల్లో 50 శాతం అధిక ఛార్జీల వసూలు
- మహిళలకు మహాలక్ష్మి పథకం కింద ఉచిత ప్రయాణం యథాతథం

నిత్యం నిఘా, హైదరాబాద్ : బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా సొంత ఊళ్లకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) భారీ ఏర్పాట్లు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 7 వేల ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ప్రకటించింది. ఈ నెల 20వ తేదీ వరకు ఈ ప్రత్యేక సర్వీసులు అందుబాటులో ఉంటాయని రంగారెడ్డి రీజియన్ రీజనల్ మేనేజర్ శ్రీదేవి వెల్లడించారు. పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకుని కొన్ని కీలక తేదీల్లో ప్రత్యేక బస్సుల్లో ఛార్జీలను 50 శాతం పెంచుతున్నట్లు టీజీఎస్ఆర్టీసీ తెలిపింది. అక్టోబరు 9, 10, 16, 17 తేదీల్లో హైదరాబాద్ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు, తిరుగు ప్రయాణంలో అక్టోబరు 25, 26 తేదీల్లో ఈ పెరిగిన ఛార్జీలు...

2

పండగ వేళ రాజకీయ నిరసనలతో వ్యాపారాలకు దెబ్బ..
- రాహుల్‌కు వర్తక సంఘాల అల్టిమేటం!

- బీజేపీ తనకు ఎన్నో అవకాశాలు ఇచ్చిందన్న కేంద్ర మంత్రి
- ఏ బాధ్యత అప్పగించినా శిరసావహిస్తానని వ్యాఖ్య
- పదవుల కోసం పాకులాడే వ్యక్తి కాదని వెల్లడి
- కేసీఆర్ భూ వివాదాలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి డ్రామాలని విమర్శ

నిత్యం నిఘా, న్యూ ఢిల్లీ : పండగల సీజన్‌లో రాజకీయ నిరసనల ప్రభావం వ్యాపారాలపై పడుతోందని దేశవ్యాప్తంగా పలు వర్తక, పారిశ్రామిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. 'ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ' (ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనల నేపథ్యంలో మార్కెట్లకు వెళ్లే దారుల్లో ఆంక్షలు, రహదారుల దిగ్బంధం వల్ల వ్యాపార కార్యకలాపాలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నాయి. నిరసనల విషయంలో పునరాలోచించాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి విజ్ఞప్తి చేశాయి. వ్యాపార సంస్థలు, కార్మికుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రధాని మోదీ, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జోక్యం చేసుకోవాలని కోరాయి. ఢిల్లీ, ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్, కర్ణాటక, కేరళం రాష్ట్రాలకు చెందిన సంఘాలు అక్టోబర్ 12, 13 తేదీల్లో ఈ మేరకు లేఖలు రాశాయి. నవరాత్రులు, దసరా, దీపావళి, ఛఠ్ పూజ సమయంలో వ్యాపారాలు ఊపందుకుంటాయని గుర్తుచేశాయి. ఈ తరుణంలో నిరసనల వల్ల వినియోగదారుల రాక తగ్గితే చిన్న వ్యాపారులు, ఉద్యోగులు, రోజువారీ కూలీల జీవనోపాధి దెబ్బతింటుందని .....



2

ఐటీ అండ.. ఫార్మా దెబ్బ.. నష్టాల్లో ముగిసిన మార్కెట్లు

- లాభాల స్వీకరణతో నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు
- సెన్సెక్స్ 252 పాయింట్లు, నిఫ్టీ 99 పాయింట్లు నష్టం
- ఫార్మా, హెల్త్‌కేర్ షేర్ల అమ్మకాల ఒత్తిడితో సూచీలు పతనం
- మార్కెట్లకు అండగా నిలిచిన ఐటీ షేర్లు



నిత్యం నిఘా, న్యూ ఢిల్లీ : దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాలతో ముగిశాయి. ఫార్మా, హెల్త్‌కేర్ రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి సూచీలను కిందకు లాగగా, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) షేర్లలో కొనుగోళ్ల మద్దతు నష్టాలను కొంతమేర పరిమితం చేసింది. వరుస లాభాల తర్వాత ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో మార్కెట్లు ఒడుదొడుకులకు లోనయ్యాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 251.89 పాయింట్లు (0.34%) నష్టపోయి 72,781.89 వద్ద .....

2

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

హైదరాబాద్‌లో సమాఖ్య బిజినెస్ సమ్మిట్..

మొదటిపేజీ తరువాయి.. అభివృద్ధి విషయంలో కాదని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ప్రభుత్వం 'CURE, PURE, RARE' అనే త్రిముఖ వ్యూహాన్ని అమలు చేయనున్నట్లు వివరించారు. ఔటర్ రింగ్ రోడ్ లోపల ఐటీ, సేవల కోసం 'కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ' (CURE), ఓఆర్ఆర్-ఆర్ఆర్ఆర్ మధ్య తయారీ రంగం కోసం 'పెరీ-అర్బన్ రీజియన్ ఎకానమీ' (PURE), మిగిలిన ప్రాంతాల్లో వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్ కోసం 'రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీ' (RARE) జోన్లను అభివృద్ధి చేస్తామన్నారు. ప్రస్తుతం దేశ జీడీపీలో తెలంగాణ వాటా 5 శాతంగా ఉందని, దీన్ని 10 శాతానికి చేర్చాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని వివరించారు. హైదరాబాద్‌కు ఉన్న 400 ఏళ్ల కాస్మోపాలిటన్ సంస్కృతిని గుర్తుచేస్తూ, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. యువత, మహిళలు పారిశ్రామిక రంగంలోకి ఎక్కువగా రావాలని పిలుపునిచ్చారు. సమఖ్య ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఈ రెండు రోజుల సదస్సు జరుగుతుండగా, ప్రారంభోత్సవంలో పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దసరాకు టీజీఎస్ఆర్టీసీ భారీ ఏర్పాట్లు..
7 వేల ప్రత్యేక బస్సులు సిద్ధం

మొదటిపేజీ తరువాయి.. వర్తిస్తాయి. అయితే, సాధారణ రోజుల్లో నడిచే బస్సుల ఛార్జీల్లో ఎలాంటి మార్పు ఉండదని అధికారులు స్పష్టం చేశారు. మహిళలకు మహాలక్ష్మి పథకం కింద ఉచిత ప్రయాణ సౌకర్యం అన్ని బస్సుల్లో యథావిధిగా కొనసాగుతుంది. ఈ 7 వేల ప్రత్యేక బస్సుల్లో అత్యధికంగా కరీంనగర్ జోన్‌కు 3,533 బస్సులు కేటాయించారు. హైదరాబాద్ జోన్‌కు 2,155, గ్రేటర్ హైదరాబాద్ జోన్‌కు 1,312 బస్సులు నడుస్తాయి. వీటితో పాటు నల్గొండకు 815, మహబూబ్‌నగర్‌కు 645, రంగారెడ్డి రీజియన్‌కు 440, మెదక్‌కు 255 బస్సులు ఏర్పాటు చేశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధి నుంచి అక్టోబరు 16న 1,354, 17న 1,211 బస్సులు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలకు బయలుదేరనున్నాయి. ప్రయాణికుల కోసం హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్, ఎల్‌బీ నగర్, కేపీహెచ్‌బీ, గచ్చిబౌలి వంటి ప్రధాన ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పందిళ్లు, తాగునీరు, మొబైల్ టాయిలెట్ల వంటి సౌకర్యాలను కల్పించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రయాణికులు ముందుగానే టిక్కెట్లు రిజర్వేషన్ చేసుకోవాలని అధికారులు సూచించారు.

ఐటీ అండ.. ఫార్మా దెబ్బ..
నష్టాల్లో ముగిసిన మార్కెట్లు

మొదటిపేజీ తరువాయి.. స్థిరపడింది. అదేవిధంగా ఎన్ఎస్ఈ నిఫ్టీ 99.25 పాయింట్లు (0.44%) క్షీణించి 22,622.70 వద్ద ముగిసింది. నిఫ్టీ కీలకమైన 22,650 స్థాయికి దిగువన ముగియడం గమనార్హం. సెన్సెక్స్ 30 షేర్లలో ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, టీసీఎస్, హిందుస్థాన్ యూనిలీవర్, ఎన్టీపీసీ వంటివి ప్రధానంగా లాభపడ్డాయి. మరోవైపు, బజాజ్ ఫైనాన్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫిన్‌సర్వ్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు నష్టపోయి సూచీపై ఒత్తిడి పెంచాయి. నిఫ్టీలో శ్రీరామ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, బజాజ్ ఫైనాన్స్ టాప్ లూజర్లుగా నిలిచాయి. రంగాల వారీగా చూస్తే.. నిఫ్టీ ఫార్మా, నిఫ్టీ హెల్త్‌కేర్ సూచీలు అత్యధికంగా నష్టపోయాయి. అయితే, నిఫ్టీ ఐటీ ఇండెక్స్ లాభాలతో ముగిసి మార్కెట్లకు కొంత అండగా నిలిచింది. ప్రధాన సూచీలతో పాటు బ్రాడర్ మార్కెట్లు కూడా బలహీనపడ్డాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.08%, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.32% మేర నష్టపోయాయి.

మీరట్ బ్లూ డ్రమ్ హత్య కేసులో సంచలన తీర్పు..
భార్య, ప్రియుడికి మరణశిక్ష!



మొదటిపేజీ తరువాయి.. ఉత్తరప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన మీరట్ బ్లూ డ్రమ్ హత్య కేసులో కీలక తీర్పు వెలువడింది. నేవీ అధికారి సౌరభ్ రాజ్‌పుత్‌ను హత్య చేసిన కేసులో ఆయన భార్య ముస్కాన్ రస్తోగి, ఆమె ప్రియుడు సాహిల్ శుక్లాకు స్థానిక కోర్టు మరణశిక్ష విధించింది. 126 విచారణల తర్వాత 22 మంది సాక్షుల వాంగ్మూలాలను పరిశీలించిన న్యాయస్థానం ఈ మేరకు తీర్పు ఇచ్చింది. 2025 మార్చి 3న ముస్కాన్ తన భర్తకు ఆహారంలో మత్తుమందు కలిపి ఇచ్చిందని, ఆ తర్వాత సాహిల్‌తో కలిసి కత్తితో పొడిచి హత్య చేసినట్లు ప్రాసిక్యూషన్ వెల్లడించింది. అనంతరం మృతదేహాన్ని ముక్కలుగా చేసి, ఇసుక, నీరు, సిమెంట్‌తో నింపిన నీలిరంగు ప్లాస్టిక్ డ్రమ్‌లో దాచినట్లు దర్యాప్తులో తేలింది. హత్య జరిగిన మరుసటి రోజు ఇద్దరూ హిమాచల్‌ప్రదేశ్‌కు వెళ్లిపోయారు. సౌరభ్ బతికే ఉన్నట్లు నమ్మించేందుకు ముస్కాన్ ఆయన ఫోన్ నుంచి కుటుంబ సభ్యులకు సందేశాలు పంపినట్లు పోలీసులు గుర్తించారు. మార్చి 17న బంధువులు అనుమానంతో అధికారులతో కలిసి ఇంటికి వెళ్లగా డ్రమ్‌లో సౌరభ్ మృతదేహం బయటపడింది. అనంతరం పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. డ్రమ్, సిమెంట్, ఇసుక, కత్తులు కొనుగోలు చేసిన దుకాణదారుల వాంగ్మూలాలతో పాటు ఫోన్ కాల్ రికార్డులు, మొబైల్ లొకేషన్ వివరాలను పోలీసులు సాక్ష్యాలుగా సమర్పించారు. నిందితులు నేరానికి పాల్పడినట్లు ఈ ఆధారాలు నిరూపించాయని ప్రాసిక్యూషన్ వాదించింది.

కమిషన్ల కోసమే సింగరేణిని దోచుకుంటున్నారు
- రేవంత్ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్

మొదటిపేజీ తరువాయి..
రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కమిషన్ల కోసం సింగరేణి సంస్థను పంచుకొని దోచుకుంటోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి.రామారావు (కేటీఆర్) ఆరోపించారు. సింగరేణిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఏమాత్రం శ్రద్ధ లేదని, ఆయన పాలనలో సంస్థ భ్రష్టుపట్టిపోతోందని విమర్శించారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో అక్టోబర్ 14న బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సింగరేణి కార్మిక గర్జన' సభలో ఆయన ప్రసంగించారు. కమిషన్ల లెక్కలు తేలకపోవడం వల్లే నైని టెండర్లను ప్రభుత్వం రద్దు చేసిందని కేటీఆర్ ఆరోపించారు. నైని కుంభ కోణాన్ని ఆపి రూ.30,000 కోట్లు ఆదా చేశామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చెప్పడాన్ని ప్రస్తావిస్తూ.. ప్రభుత్వ పెద్దల మధ్య వాటాలు తేలనప్పుడే ఇలాంటి కుంభ కోణాలు బయటకు వస్తాయని ఎద్దేవా చేశారు. 'సైట్ విజిట్ సర్టిఫికెట్' అనే కొత్త నిబంధన పేరుతో సింగరేణిలో సుమారు రూ.10,000 కోట్ల భారీ కుంభకోణం జరుగుతోందని కేటీఆర్ సంచలన ఆరోపణ చేశారు. దీనితో పాటు సోలార్, జిలెటిన్ స్టిక్స్ కొనుగోళ్లు, మరో నాలుగైదు అంశాల్లోనూ పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని దుయ్యబట్టారు. సింగరేణి కార్మికుల జీవితాలను నాశనం చేస్తున్న ఈ అక్రమాలపై ఆధారాలతో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాశామని కేటీఆర్ వెల్లడించారు. ఇప్పటికే సింగరేణిలో జరుగుతున్న దోపిడీపై చర్యలు తీసుకోవాలని కిషన్ రెడ్డి సైతం ముఖ్యమంత్రికి లేఖ రాసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అధికార పార్టీ నేతలు ఒకరినొకరు కాపాడుకుంటూ, కమిషన్ల కోసం సింగరేణిని కొల్లగొడుతున్నారని ఆయన మండిపడ్డారు. సింగరేణిలో జరుగుతున్న అవకతవకలపై బీఆర్ఎస్ చేస్తున్న పోరాటంలో భాగంగానే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

పండగ వేళ రాజకీయ నిరసనలతో వ్యాపారాలకు దెబ్బ..
- రాహుల్‌కు వర్తక సంఘాల అల్టిమేటం!

మొదటిపేజీ తరువాయి.. ఆందోళన వ్యక్తం చేశాయి. 'భారతీయ ఉద్యోగ్ వ్యాపార్ మండల్' ఢిల్లీ విభాగం, ఉత్తర్‌ప్రదేశ్ ఉద్యోగ్ వ్యాపార్ మండల్, 'ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా' తదితర సంఘాలు రాహుల్ గాంధీకి విజ్ఞప్తి చేశాయి. రాజకీయ విభేదాలకు వ్యాపారులు ఆర్థిక మూల్యం చెల్లించాల్సిన పరిస్థితి రాకూడదని స్పష్టం చేశాయి. పండగల సమయంలో వీధి నిరసనలను విరమించి, చర్చలు, చట్టపరమైన మార్గాల ద్వారా తమ అభ్యంతరాలను వ్యక్తం చేయాలని సూచించాయి. ప్రధాని మోదీతో పాటు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి 'జైపుర్ వ్యాపార్ మహాసంఘ్' లేఖలు రాసింది. మార్కెట్లలో సాధారణ పరిస్థితులు నెలకొనేలా చర్యలు తీసుకోవాలని కోరింది. ఢిల్లీలోని 'న్యూఢిల్లీ ట్రేడర్స్ అసోసియేషన్', 'నై సడక్ ట్రేడర్స్ అసోసియేషన్', 'మయాపురి పారిశ్రామిక సంఘం' సహా పలు సంస్థలు కూడా మార్కెట్లకు రాకపోకలు సజావుగా సాగేలా చూడాలని విజ్ఞప్తి చేశాయి. 'ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్స్' (ఎఫ్ఏఐడీఏ), 'బెంగళూరు హోల్‌సేల్ క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్' సైతం న్యాయపరమైన రక్షణ కోరాయి. మహిళా వ్యాపారులు, చిన్న పరిశ్రమలు, ఆహార ప్రాసెసింగ్ సంస్థల ఇబ్బందులనూ పలు సంఘాలు ప్రస్తావించాయి. కేరళంలోని 'కాలికట్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ' కూడా మార్కెట్లు, రవాణా మార్గాలకు రక్షణ కల్పించాలని కోరింది. ప్రజాస్వామ్యంలో శాంతియుత నిరసన హక్కును గౌరవిస్తూనే, చట్టబద్ధమైన వ్యాపార కార్యకలాపాలకు ఆటంకం కలగకుండా చూడాలని విజ్ఞప్తి చేశాయి. ఢిల్లీలోని 'ఖాన్ మార్కెట్ ట్రేడర్స్ అసోసియేషన్' అధ్యక్షుడు సంజీవ్ మెహ్రా తెలిపిన వివరాల ప్రకారం.. పోలీసుల బారికేడ్ల వల్ల వినియోగదారులు మార్కెట్‌కు చేరుకోవడం కష్టంగా మారింది. దీంతో సాధారణ స్థాయిలో 10-20 శాతం వ్యాపారమే జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. అయితే నిరసనల వల్ల జరిగిన మొత్తం ఆర్థిక నష్టంపై స్వతంత్రంగా ధ్రువీకరించిన గణాంకాలు ఈ లేఖల్లో లేవు.

భారత అంతర్గత విషయాలు మీకెందుకు?
అమెరికన్ సింగర్‌కు అభిజిత్ దీపేం కౌంటర్

మొదటిపేజీ తరువాయి.. కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)కి అమెరికాలోని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యతిరేకుల నుంచి నిధులు అందుతున్నాయంటూ అమెరికన్ గాయని మేరీ మిల్బెన్ చేసిన ఆరోపణలపై ఆ పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీపేం తీవ్రంగా స్పందించారు. భారతీయులను అప్రతిష్ఠపాలు చేసేందుకు ప్రధాని నరేంద్ర మోదీ అమెరికన్ల మద్దతు ఎందుకు కోరుతున్నారని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం 'ఎక్స్'లో ఒక పోస్ట్ చేశారు. భారత్ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకునే హక్కు విదేశీ పౌరులకు ఎవరిచ్చారని అభిజిత్ దీపేం నిలదీశారు. "మా దేశ సమస్యలను మేమే పరిష్కరించుకోగలం. మా వ్యవహారాల్లో బయటి వ్యక్తుల జోక్యం అవసరం లేదు" అని ఆయన తన పోస్టులో స్పష్టం చేశారు. అంతకుముందు మేరీ మిల్బెన్ 'ఎక్స్' వేదికగా అభిజీత్ దీపేం, సీజేపీని టార్గెట్ చేస్తూ సంచలన ఆరోపణలు చేశారు. "ప్రధాని మోదీకి, ఆయన నాయకత్వంలో దేశ భవిష్యత్తుకు వ్యతిరేకంగా ఉన్న అమెరికా డోనర్లు సీజేపీకి నిధులు సమకూరుస్తున్నారు" అని ఆమె ఆరోపించారు. సీజేపీకి వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసనలు చేపట్టాలని భారత యువతకు ఆమె పిలుపునిచ్చారు. "భారత గడ్డపై పుట్టి, పెరిగి, చదువుకున్న వారు దేశ ప్రజాస్వామ్యాన్ని, స్వేచ్ఛను కాపాడేందుకు ఉద్యమించాల్సిన సమయం వచ్చింది" అని ఆమె పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా సంప్రదాయవాద నాయకులను లక్ష్యంగా చేసుకునేందుకు ఒక పద్ధతిని అనుసరిస్తారని, అందులో భాగంగానే అమెరికాలో చదువుకున్న వారిని గుర్తించి, వారిలో తీవ్రవాద భావజాలం నింపి, తిరిగి వారి దేశానికి పంపి, గందరగోళం సృష్టించేందుకు నిధులు ఇస్తారని మిల్బెన్ ఆరోపించారు.

సినిమా చూస్తూ డ్రైవింగ్.. ఆటో డ్రైవర్‌పై వీసీ సజ్జనార్ సీరియస్

మొదటిపేజీ తరువాయి.. డ్రైవింగ్ చేస్తూ సినిమా చూడటం, చెవులకు హెడ్‌ఫోన్స్ పెట్టుకోవడం వంటి నిర్లక్ష్యపూరిత చర్యలపై హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ తీవ్రంగా స్పందించారు. ఓ ఆటో డ్రైవర్ ఒకేసారి రెండు ఫోన్లు వాడుతూ, చెవులకు హెడ్‌ఫోన్స్ పెట్టుకుని సినిమా చూస్తూ వాహనం నడుపుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆ డ్రైవర్‌ను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఒక నెటిజన్ పంపిన ఈ వీడియోపై సజ్జనార్ తన 'ఎక్స్' ఖాతాలో స్పందించారు. "రెండు కళ్లకు ఎదురుగా రెండు ఫోన్లు, ఒక దాంట్లో నావిగేషన్, మరో దాంట్లో సినిమా, చెవులకు పెద్ద హెడ్‌ఫోన్లు. ఇది చూడటానికి గేమింగ్ విన్యాసంలా ఉన్నా, ప్రయాణికుల పాలిట నడుస్తున్న మృత్యుశకటం" అని ఆయన తీవ్రంగా వ్యాఖ్యానించారు. డ్రైవింగ్ సమయంలో క్షణకాలం దృష్టి మళ్లినా ఘోర ప్రమాదాలు జరుగుతాయని ఆయన హెచ్చరించారు. ఇలా సినిమా చూస్తూ వాహనం నడపడం కేవలం నిర్లక్ష్యం మాత్రమే కాదని, క్షమించరాని నేరమని స్పష్టం చేశారు. మోటార్ వెహికిల్ యాక్ట్ ప్రకారం ఇది 'ప్రమాదకర డ్రైవింగ్' కిందకు వస్తుందని, దీనికి భారీ జరిమానాతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ కూడా రద్దయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. వినోదం కోసం ప్రయాణికుల ప్రాణాలను పణంగా పెట్టవద్దని, ఆటోను థియేటర్‌గా మార్చి జీవితాలకు 'బి ఎండ్' కార్డు వేయొద్దని ఆయన హెచ్చరించారు. ఈ విషయంలో ప్రయాణికులు కూడా అప్రమత్తంగా ఉండాలని సజ్జనార్ సూచించారు. డ్రైవర్ ఫోన్ చూస్తున్నా, హెడ్‌ఫోన్లు పెట్టుకున్నా మౌనంగా ఉండవద్దని, వెంటనే ప్రశ్నించి వారించాలని కోరారు. వారు వినని పక్షంలో డయల్ 112కు కాల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో, వీడియోలో కనిపించిన టీజీ15యూ2657 నంబర్ గల ఆటో డ్రైవర్‌ను గుర్తించి, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులను ఆదేశించినట్లు సజ్జనార్ వెల్లడించారు.

భారత్‌పై ఐఎస్ఐ 'డిజిటల్ జిహాద్'.. నిరసనలే లక్ష్యంగా 5వేల ఫేక్ అకౌంట్లతో కుట్ర!

మొదటిపేజీ తరువాయి.. భారత్‌పై పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ 'డిజిటల్ జిహాద్'ను తీవ్రతరం చేసింది. దేశంలో జరుగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) నిరసనలను ఆసరాగా చేసుకుని, హింసను ప్రేరేపించేందుకు భారీ కుట్రకు తెరలేపింది. గత రెండు వారాల్లోనే సుమారు 5,000కు పైగా నకిలీ సోషల్ మీడియా ఖాతాలను సృష్టించి, భారత భద్రతా బలగాలు, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా విష ప్రచారాన్ని ఉధృతం చేసినట్లు భారత నిఘా వర్గాలు గుర్తించాయి. ఈ ఫేక్ ఖాతాల ప్రధాన లక్ష్యం నిరసనల్లో పాల్గొంటున్న యువతను రెచ్చగొట్టడమేనని 'ఇంటెలిజెన్స్ బ్యూరో' (ఐబీ) అధికారి ఒకరు తెలిపారు. పోలీసుల లాఠీఛార్జ్, కాల్పులు, భాష్పవాయువు ప్రయోగం వంటి అబద్ధాలతో కూడిన పోస్టులను సృష్టించి సోషల్ మీడియాలో వ్యాప్తి చేస్తున్నారు. దీని ద్వారా యువతను హింస వైపు మళ్లించి, దేశవ్యాప్తంగా అశాంతిని సృష్టించాలన్నది ఐఎస్ఐ వ్యూహంగా కనిపిస్తోందని ఆయన వివరించారు. ఈసారి ఐఎస్ఐ తన కార్యకలాపాల శైలిని మార్చిందని దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. గతంలో రావల్పిండి, ఇస్లామాబాద్ వంటి ప్రధాన కేంద్రాల నుంచి ఫేక్ న్యూస్ వ్యాప్తి చేసేవారు. దీంతో వారిని గుర్తించడం సులభమయ్యేది. కానీ, ఇప్పుడు భింబర్, రావల్‌కోట్, సియాల్‌కోట్, పెషావర్ వంటి అనేక చిన్న పట్టణాలకు తమ కార్యకలాపాలను విస్తరించారు. స్థానికులను నియమించుకుని వారి ద్వారా సోషల్ మీడియా ఖాతాలు తెరిపించి, తాము అందించిన సమాచారాన్ని పోస్ట్ చేయిస్తున్నారు. ఈ పోస్టుల వ్యాప్తిని పెంచేందుకు విదేశాల్లోని యూజర్లను కూడా ట్యాగ్ చేయాలని సూచిస్తున్నారు. ఈ ఫేక్ న్యూస్ ఎంత ప్రమాదకరంగా ఉందంటే, ఇటీవల కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై కూడా తప్పుడు ప్రచారం చేశారు. ఢిల్లీలో పోలీసుల కాల్పుల్లో రాహుల్ గాయపడినట్లు కొన్ని ఖాతాల్లో పోస్ట్ చేశారు. ఈ వార్తతో కాంగ్రెస్ మద్దతుదారులను రెచ్చగొట్టి, దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ ఆందోళనలు సృష్టించేందుకు ప్రయత్నించారు. అంతేకాకుండా, 'ఆపరేషన్ గ్రౌండ్ వైర్' పేరుతో కొందరు భారతీయులకు డబ్బులు చెల్లించి, వారి ద్వారానే భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా కంటెంట్ సృష్టింపజేస్తున్నట్లు కూడా నిఘా వర్గాలు గుర్తించాయి. భారత ఫ్యాక్ట్-చెక్ సంస్థలు ఈ వార్తలను నకిలీవని తేల్చేలోపే, జరగాల్సిన నష్టం జరిగిపోతోందని, ప్రజల అభిప్రాయాలను ప్రభావితం చేయడంలో ఐఎస్ఐ విజయవంతమవుతోందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఐబీ, రాష్ట్ర పోలీసులు నిరంతరం ఇలాంటి ఖాతాలను పర్యవేక్షిస్తున్నప్పటికీ, వేల సంఖ్యలో ఉన్న ఈ ఖాతాలను అరికట్టడం పెద్ద సవాలుగా మారింది.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

కోమటిపల్లిలో రైల్వే ఫ్లైఓవర్‌పై గ్రామస్థుల ఆందోళన

హన్మకొండ, అక్టోబర్ 14 (నిత్యం నిఘా ప్రతినిధి): హసన్‌పర్తి మండలం కోమటిపల్లి రైల్వే గేటు వద్ద ప్రతిపాదిత రైల్వే ఫ్లైఓవర్ (ఆర్వోబీ) నిర్మాణానికి సంబంధించి హద్దుల పరిశీలన చేపట్టేందుకు బుధవారం రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించారు. హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, హసన్‌పర్తి తహసీల్దార్ కిరణ్ కుమార్, ఇతర రెవెన్యూ సిబ్బందితో కలిసి నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించారు.



ఇళ్లు కోల్పోతామని ఆందోళన

అధికారుల పర్యటన విషయం తెలుసుకున్న స్థానిక గ్రామస్థులు, బాధితులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని తమ ఆందోళనను వ్యక్తం చేశారు. ఫ్లైఓవర్ నిర్మాణంతో నివాస గృహాలు, ఇతర నిర్మాణాలు దెబ్బతిని తాము ఇళ్లు కోల్పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తరతరాలుగా నివసిస్తున్న ఇళ్లను కోల్పోతే తమ కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా తీవ్రంగా నష్టపోతాయని పేర్కొన్నారు.

అండర్‌పాస్ నిర్మించాలని విజ్ఞప్తి

స్థానిక నివాసాలకు నష్టం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించాలని గ్రామస్థులు అధికారులను కోరారు. ఫ్లైఓవర్‌కు బదులుగా వాహనాల రాకపోకలకు అనుకూలంగా రైల్వే అండర్‌పాస్ నిర్మించాలని ఆర్డీవో వెంకటేష్‌కు వినతిపత్రం సమర్పించారు. ప్రజా ప్రయోజనాలతో పాటు పేద కుటుంబాల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.గ్రామస్థుల వినతులపై స్పందించిన ఆర్డీవో వెంకటేష్, వారి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన విధంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

మంథని పశు వైద్యశాలలో వేళాపాళా లేని విధులు

- **మధ్యాహ్నానికే ఆసుపత్రికి తాళం..**
  పశువైద్య సేవలకు రైతుల అవస్థలు

పెద్దపల్లి జిల్లా / మంథని, అక్టోబర్ 14 (నిత్యం నిఘా ప్రతినిధి): ప్రభుత్వ కార్యాలయాల్లో సమయపాలన పాటించాల్సిన సిబ్బందే నిబంధనలను విస్మరిస్తే ప్రజలకు సేవలు ఎలా అందుతాయని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మంథని ప్రభుత్వ పశు వైద్యశాలలో సిబ్బంది విధుల నిర్వహణపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.ప్రభుత్వ పశు వైద్యశాల పనివేళలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉన్నప్పటికీ, మధ్యాహ్నం ఒంటి గంట నుంచే వైద్య సేవలు అందుబాటులో ఉండటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో మధ్యాహ్నం 2 గంటలలోపే ఆసుపత్రికి తాళాలు వేసి సిబ్బంది వెళ్లిపోతున్నారని చెబుతున్నారు. దీంతో పశువులకు వైద్యం చేయించేందుకు ఆసుపత్రికి వచ్చే రైతులు, పశు పోషకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు తప్పని ఇబ్బందులు

పాడి పశువులు అనారోగ్యానికి గురైనప్పుడు సకాలంలో వైద్యం అందకపోతే రైతులు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిర్ణీత సమయం వరకు సిబ్బంది అందుబాటులో ఉండి బాధ్యతగా సేవలందించాలని స్థానికులు కోరుతున్నారు.



ఉన్నతాధికారులు స్పందించేనా?

మంథని ప్రభుత్వ పశు వైద్యశాలలో విధుల నిర్వహణ, సమయపాలనపై సంబంధిత ఉన్నతాధికారులు విచారణ చేపట్టి వాస్తవాలను పరిశీలించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పశువులకు నిరంతర వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు, విధుల్లో నిర్లక్ష్యం ఉన్నట్లు తేలితే బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలకు నిరసనగా బీఆర్ఎస్ మహా ధర్నా

ములుగు జిల్లా /తాడ్వాయి, అక్టోబర్ 14 (నిత్యం నిఘా ప్రతినిధి):
రాష్ట్రంలో అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం కొత్తూరు సబ్‌స్టేషన్ ఎదుట మహా ధర్నా నిర్వహించారు. తాడ్వాయి మండల మాజీ అధ్యక్షుడు దండుగుల మల్లయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో పార్టీ నాయకులు, రైతులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



విద్యుత్ కోతలతో రైతులకు ఇబ్బందులు

ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించారని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అప్రకటిత విద్యుత్ కోతలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు.ప్రస్తుతం పంటలు కీలక దశలో ఉన్నాయని, సాగుకు సరైన సమయంలో విద్యుత్ అందకపోతే పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కరెంటు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందని తెలిపారు. లో–వోల్టేజ్ సమస్యతో రైతుల మోటార్లు కాలిపోతున్నాయని, ఇప్పటికే పెట్టుబడులతో ఇబ్బందులు పడుతున్న రైతులపై అదనపు ఆర్థిక భారం పడుతోందని పేర్కొన్నారు.



నాణ్యమైన విద్యుత్ అందించాలి

పంట పొలాలకు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని, అప్రకటిత కోతలను వెంటనే నిలిపివేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. లో–వోల్టేజ్ సమస్య ఉన్న ప్రాంతాల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని, విద్యుత్ సరఫరా వేళలపై రైతులకు ముందస్తు సమాచారం అందించాలని కోరారు.ప్రభుత్వం, విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి రైతుల సమస్యలను పరిష్కరించాలని, నిర్లక్ష్యం కొనసాగితే ప్రజలను సమీకరించి ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అధికారులకు వినతిపత్రం

ధర్నా అనంతరం సంబంధిత విద్యుత్ శాఖ ఏడీ, ఏఈ అధికారులకు నాయకులు వినతి పత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో మేడారం మాజీ ట్రస్టు బోర్డు చైర్మన్ కాక లింగన్న, సర్పంచ్ కొమరం శైలజ, మాజీ సర్పంచులు చీడం బాబురావు, గుర్రం సమ్మిరెడ్డి, గడ్డం అరుణ, సిద్ధబోయిన శివరాజ్, గొంది శ్రీధర్, ఎంపీటీసీ కుక్కల శ్రీను, కోట సురేష్, ఎండీ రఫీక్, సిద్ధబోయిన వసంతరావు, భుక్య శ్రీను, జీడి బాబురావు, మొక్క భాస్కర్, పత్తి గోపాల్ రెడ్డి, గోపనబోయిన కొమురయ్య, రతన్ సింగ్, ఏడవెల్లి మధు, గోపాలపురం సతీష్, సంకె ప్రణయ్, కోయిలకుంట్ల ప్రసాద్, ఓగలబోయిన సహోదర్, కందుకూరి సమ్మయ్య, గంగసాని మహేష్, ఎల్లబోయిన ఐలయ్య, గజ్జల మహేష్, సోలం వెంకన్న, నీలం రామన్నతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

దుర్గామాతకు ప్రత్యేక పూజలు.. అన్నవితరణలో పాల్గొన్న ఎర్రబెల్లి రేణుక ప్రదీప్ రావు దంపతులు

వరంగల్, అక్టోబర్ 14 (నిత్యం నిఘా ప్రతినిధి): దేవీ నవరాత్రుల సందర్భంగా వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని కరీమాబాద్ లక్ష్మీనగర్‌లో శ్రీ లక్ష్మీ యువశక్తి యూత్ (మందా శ్రీనివాస్) ఆధ్వర్యంలో దుర్గామాత నవరాత్రి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నవితరణ కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమంలో ఎర్రబెల్లి రేణుక ప్రదీప్ రావు దంపతులు పాల్గొని దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నవితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కందిమల్ల మహేష్, కత్తెర శాల వేణుతో పాటు పలువురు స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.





కాకతీయ యూనివర్సిటీ సెంట్రల్ లైబ్రరీలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

- **తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా వేడుకలు..**
  ఉత్సాహంగా పాల్గొన్న అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు





హనుమకొండ / కే యూ , అక్టోబర్ 14 (నిత్యం నిఘా ప్రతినిధి): కాకతీయ యూనివర్సిటీ సెంట్రల్ లైబ్రరీలో బతుకమ్మ వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించేలా పండుగ వాతావరణంలో ఈ వేడుకలు జరిగాయి. అధ్యాపకులు, లైబ్రరీ సిబ్బంది, విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని సంబరాలను అంబరాన్నంటించారు.ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ లైబ్రరీ ఇన్‌ఛార్జ్ సభ్యురాలు డాక్టర్ బి. రాధికా రాణి, సెరికల్చర్ విభాగం అధ్యాపకురాలు డాక్టర్ కె. సుజాత, మైక్రోబయాలజీ విభాగం అధ్యాపకురాలు డాక్టర్ సుజాత పాల్గొన్నారు. లైబ్రరీ అసిస్టెంట్లు టి. జవేర్, సుమలతతో పాటు యు. రాజు, ఇందిర, ఇతర సిబ్బంది వేడుకల్లో భాగస్వాములయ్యారు.విద్యార్థినులు అఖిల, జ్యోతి, రాధిక తదితరులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలకు మరింత శోభను తీసుకొచ్చారు.కేవలం విజ్ఞాన సముపార్జన కేంద్రంగానే కాకుండా, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు, సామాజిక ఐక్యతను పెంపొందించేందుకు కూడా యూనివర్సిటీ సెంట్రల్ లైబ్రరీ కృషి చేస్తోందని ఈ వేడుకలు చాటిచెప్పాయి. భావితరాలకు తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని అందించాల్సిన ఆవశ్యకతను ఈ కార్యక్రమం గుర్తుచేసింది.

అతిథి అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటమే శరణ్యం



హనుమకొండ, అక్టోబర్ 14 (నిత్యం నిఘా ప్రతినిధి): అతిథి అధ్యాపకులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలే మార్గమని తెలంగాణ ప్రభుత్వ కళాశాలల గెస్ట్ అధ్యాపకుల సంఘం (టీజీసీజీటీఏ) రాష్ట్ర అధ్యక్షుడు డా. కె. సురేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల సమస్యలపై నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అతిథి అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు వేతనాలను గణనీయంగా పెంచాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన హక్కులను సాధించుకునేందుకు అధ్యాపకులంతా ఐక్యంగా ఉద్యమించాలని సూచించారు.ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు అతిథి అధ్యాపకులు కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సేవలకు తగిన గుర్తింపు, గౌరవం లభించాలని ఆయన అభిప్రాయపడ్డారు. అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు.ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి. శ్రీనివాస్, ఏవో నవీన్, నాయకులు పెండ్యాల సురేష్, రాజిరెడ్డి, రమేష్‌తో పాటు పలువురు అతిథి అధ్యాపకుల ప్రతినిధులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

అన్నారం షరీఫ్‌లో సీసీ కెమెరాలు ప్రారంభం

- గ్రామ భద్రతకు సీసీ కెమెరాలు కీలకం: పోలీసు అధికారులు





వరంగల్ /పర్వతగిరి, అక్టోబర్ 14 (నిత్యం నిఘా ప్రతినిధి): పెద్దపల్లి జిల్లాలోని చారిత్రక రామగిరి ఖిల్లా విశిష్టతను, దాని చరిత్రను ప్రజలకు పరిచయం చేయడంతో పాటు ప్రకృతి అందాలు, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు 'మన జిల్లా – మన రామగిరి ఖిల్లా' పేరుతో నడక, పర్వతారోహణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మంగళవారం పెద్దపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో 'మన జిల్లా – మన రామగిరి ఖిల్లా' పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీ ఆదివారం ఉదయం 6 గంటలకు బేగంపేట గ్రామం నుంచి ట్రెక్కింగ్ ప్రారంభమవుతుందని వెల్లడించారు. రామగిరి ఖిల్లాకు చేరుకుని అక్కడి అడవి అందాలను వీక్షించడంతో పాటు చారిత్రక విశేషాలను తెలుసుకునేందుకు ఇది మంచి అవకాశమని పేర్కొన్నారు.

పేర్ల నమోదు తప్పనిసరి

ట్రెక్కింగ్‌లో పాల్గొనాలనుకునే వారు పోస్టర్‌పై ఉన్న సంకేత చిత్రాన్ని (క్యూఆర్ కోడ్) స్కాన్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రకృతి ఒడిలో నడుస్తూ రామగిరి ఖిల్లా గొప్పతనాన్ని తెలుసుకునే ఈ కార్యక్రమం ప్రజలకు ప్రత్యేక అనుభూతిని అందిస్తుందని తెలిపారు.

అడవి, పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ట్రెక్కింగ్ సమయంలో అడవిలోని చెట్లు, మొక్కలు, ఇతర వృక్ష సంపదకు ఎలాంటి హాని కలిగించకూడదని కలెక్టర్ సూచించారు. ప్రకృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, పర్యావరణ పరిరక్షణ పట్ల ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. రామగిరి ఖిల్లా వంటి చారిత్రక ప్రదేశాల ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయడం, వాటి పరిరక్షణపై అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూనే మన పూర్వీకులు అందించిన చారిత్రక వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏజే పెడల్స్ సైకిల్స్‌కు చెందిన అఖిల్‌రెడ్డి, మాజీ సైనికుడు, అంతర్జాతీయ పర్వతారోహకుడు లెంకల మహిపాల్‌రెడ్డి, పెద్దపల్లి యువశక్తి సామాజిక మాధ్యమాల ప్రతినిధి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో అన్నారం పల్లవి హైస్కూల్ విద్యార్థినుల ప్రతిభ



వరంగల్ /పర్వతగిరి, అక్టోబర్ 14నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం అన్నారం గ్రామంలోని పల్లవి హైస్కూల్ విద్యార్థినులు రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి పాఠశాలకు, గ్రామానికి, జిల్లాకు గుర్తింపు తీసుకొచ్చారు. నిజామాబాద్‌లో నిర్వహించిన 11వ తెలంగాణ రాష్ట్రస్థాయి మినీ సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌లో వరంగల్ జిల్లా జట్టు మూడో స్థానం సాధించడంలో పల్లవి హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థినులు కీలక పాత్ర పోషించారు.ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులు పతకాలు, ప్రశంసాపత్రాలు, ట్రోఫీ సాధించి తమ ప్రతిభను చాటుకున్నారు. వీరిలో ఒక విద్యార్థిని జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యే అవకాశం ఉండటంతో పాఠశాల వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.విద్యార్థినుల కృషి, పట్టుదలతో పాటు కోచ్‌ల శిక్షణ, మార్గదర్శకత్వం విజయానికి దోహదపడ్డాయని పాఠశాల వర్గాలు పేర్కొన్నాయి. క్రీడల్లో విద్యార్థులు రాణించేందుకు ప్రోత్సాహం అందించడం అభినందనీయమని తెలిపారు.ఈ సందర్భంగా పల్లవి హైస్కూల్ చైర్మన్ రాచకొండ అశోక్ చారి విజయం సాధించిన విద్యార్థినులతో పాటు కోచ్‌లను ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులోనూ మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

మురుగు కంపుతో ప్రజల అవస్థలు.. పట్టించుకునేదెవరు?

- ధర్మారంలో పూడిక తీయని డ్రెయినేజీ.. దోమల బెడదతో గ్రామస్తుల ఆందోళన

పెద్దపల్లి జిల్లా/ మంథని, అక్టోబర్ 14 (నిత్యం నిఘా ప్రతినిధి):మంథని మండలం ధర్మారం గ్రామంలో మురుగు కాలువల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సైడ్ డ్రెయిన్‌లో మురుగు నీరు నిలిచిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని, దోమల బెడద పెరుగుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిసరాలు అపరిశుభ్రంగా మారడంతో చిన్నారులు, వృద్ధుల ఆరోగ్యంపై ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు.

నిలిచిన మురుగు నీటితో ఇబ్బందులు

గ్రామంలో మురుగు నీరు సక్రమంగా పారకపోవడంతో కాలువల్లో నీరు నిలిచిపోయి దుర్వాసన వస్తోందని స్థానికులు చెబుతున్నారు. పారిశుధ్య సమస్య కారణంగా దోమలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి మురుగు కాలువల్లో పూడిక తొలగించి, నీరు సజావుగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.గ్రామానికి చెందిన రాయినేని స్వామి తన ఇంటి ముందు నుంచి మురుగు నీరు వెళ్లకుండా కోర్టును ఆశ్రయించి స్టే ఉత్తర్వులు తీసుకువచ్చినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. దీంతో మురుగు నీటి పారుదలకు ఆటంకం ఏర్పడిందని పేర్కొంటున్నారు. అయితే, కోర్టు ఉత్తర్వుల పూర్తి వివరాలు అధికారికంగా తెలియాల్సి ఉంది.

చట్టపరిధిలో సమస్యకు పరిష్కారం చూపాలి

మురుగు కాలువ సమస్యను గ్రామపంచాయతీ పాలకవర్గం, మండల అధికారులు తక్షణమే పరిశీలించాలని గ్రామస్తులు కోరుతున్నారు. కోర్టు ఉత్తర్వులకు



విరుద్ధంగా వ్యవహరించకుండా, చట్టపరమైన మార్గాల్లో సమస్యను పరిష్కరించి మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రజారోగ్యంపై దృష్టి పెట్టాలి

గ్రామంలో పారిశుధ్య నిర్వహణను మెరుగుపరిచి, దోమల వ్యాప్తిని అరికట్టేందుకు తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. సమస్యను త్వరితగతిన పరిష్కరించి గ్రామస్తులకు ఉపశమనం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. సంబంధిత అధికారులు ఎప్పుడు స్పందించి సమస్యకు పరిష్కారం చూపుతారో వేచి చూడాల్సి ఉంది.

విద్యుత్ కోతలపై రైతుల ఆగ్రహం.. కటాపూర్ సబ్‌స్టేషన్ ముట్టడి

- నిరంతర విద్యుత్ సరఫరా చేయాలి.. కోతలు నిలిపివేయాలని బీఆర్ఎస్ నేతల డిమాండ్

ములుగు జిల్లా /తాడ్వాయి, అక్టోబర్ 14 (నిత్యం నిఘా ప్రతినిధి): వ్యవసాయానికి సరైన విద్యుత్ సరఫరా లేక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ తాడ్వాయి మండలం కటాపూర్ గ్రామంలో రైతులు బుధవారం విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. బీఆర్ఎస్ పార్టీ మాజీ జడ్పీటీసీ రామసహాయం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆందోళనలో రైతులు పాల్గొని విద్యుత్ కోతలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

ఏడు గంటల విద్యుత్‌తో ఇబ్బందులు

ఈ సందర్భంగా రామసహాయం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయానికి ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేయాలని కోరారు. ప్రస్తుతం రోజుకు కేవలం ఏడు గంటలు మాత్రమే విద్యుత్ అందుతోందని, అది కూడా ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.సాగు పనులు కీలక దశలో ఉన్న సమయంలో విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు ఏర్పడటంతో పంటలకు సకాలంలో నీరు అందించలేకపోతున్నామని రైతులు వాపోయారు. విద్యుత్



కోతలతో వ్యవసాయ పనులు దెబ్బతింటున్నాయని, అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వాలి

అప్రకటిత విద్యుత్ కోతలను వెంటనే నిలిపివేయాలని, వ్యవసాయానికి నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించాలని నాయకులు కోరారు. విద్యుత్ సరఫరా వేళలపై రైతులకు ముందస్తు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. రైతుల ఇబ్బందులను పరిష్కరించకపోతే తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా సర్పంచుల ఫోరం జేఏసీ అధ్యక్షుడు దిడ్డి మోహన్ రావు, సర్పంచులు జజా విజయ చంద్రం, శివ ప్రసాద్, మాజీ మండల అధ్యక్షుడు నూశెట్టి రమేష్, ఉపసర్పంచ్ పాలకుర్తి బాబు, సీనియర్ నాయకుడు ముంద్రాతి రాజమౌళి, రతన్ తదితర నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

మహిళలు, బాలికల భద్రతకు 'నిర్భయ నిధి'తో ములుగుకు ప్రత్యేక అవకాశం

- సురక్షిత పట్టణాల అభివృద్ధి ప్రయోగాత్మక ప్రాజెక్టుకు జిల్లా ఎంపిక
- న్యూఢిల్లీ సమీక్షా సమావేశానికి హాజరైన కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు

ములుగు, అక్టోబర్ 14 (నిత్యం నిఘా ప్రతినిధి): మహిళలు, బాలికల భద్రత, రక్షణ, సాధికారతకు ప్రాధాన్యమిస్తూ సురక్షితమైన సమగ్ర పట్టణాల అభివృద్ధి కోసం చేపట్టనున్న ప్రయోగాత్మక ప్రాజెక్టుకు నిర్భయ నిధి కింద ములుగు జిల్లా ఎంపికైంది. ఈ ప్రాజెక్టు అమలు, కార్యాచరణ ప్రణాళికపై కేంద్ర మహిళా, శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో బుధవారం న్యూఢిల్లీలో నిర్వహించిన సమీక్షా సమావేశానికి జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు హాజరయ్యారు.సమావేశంలో ప్రాజెక్టు అమలుకు అవసరమైన ప్రణాళికలు, వివిధ ప్రభుత్వ శాఖల భాగస్వామ్యం, మౌలిక సదుపాయాల కల్పన, మహిళలు, బాలికల భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. జిల్లాలో చేపట్టనున్న కార్యక్రమాలు, సంబంధిత శాఖల మధ్య సమన్వయం, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు.ఈ ప్రాజెక్టు ద్వారా మహిళలు, బాలికలకు సురక్షితమైన ప్రజా ప్రదేశాలను అభివృద్ధి చేయడంతో పాటు, వారి అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు. సమాన అవకాశాలు, సౌకర్యవంతమైన వాతావరణాన్ని అందిస్తూ వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రోత్సాహం కల్పించనున్నారు. భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, మహిళల సాధికారతను ప్రోత్సహించడం, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.మహిళా ఉద్యోగులు, అసంఘటిత రంగాల్లో పనిచేసే మహిళలు తమ సమస్యలు, అభివృద్ధి ప్రణాళికలు, విజయాలు,



భవిష్యత్ కార్యాచరణపై చర్చించుకునేందుకు అనువైన వేదికను ఏర్పాటు చేసే అంశాన్ని కూడా పరిశీలించనున్నారు. ఇందుకోసం 'నిర్భయ సదన్' వంటి ప్రతిపాదిత కార్యక్రమాల అమలుపై చర్చించనున్నారు.ములుగు జిల్లా ఈ ప్రాజెక్టుకు ఎంపిక కావడం మహిళలు, బాలికల భద్రత, గౌరవం, స్వావలంబనకు దోహదపడనుంది. సంబంధిత శాఖల సమన్వయంతో ప్రాజెక్టును సమర్థవంతంగా అమలు చేసి, మహిళలు, బాలికలకు సురక్షితమైన వాతావరణం కల్పించేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేయనుంది.ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి ఇ.పి. ప్రేమలత పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

సుల్తానాబాద్‌లో అక్రమ పార్కింగ్, ఆక్రమణల తొలగింపు

పెద్దపల్లి జిల్లా/ సుల్తానాబాద్, అక్టోబర్ 14 (నిత్యం నిఘా ప్రతినిధి):సుల్తానాబాద్ పట్టణంలో ట్రాఫిక్ సమస్యలను నివారించి, ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా పోలీసులు, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా చర్యలు చేపట్టారు. ప్రధాన రహదారులపై అక్రమ పార్కింగ్‌ను తొలగించడంతో పాటు, రహదారులను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రహదారులపై వాహనాల తొలగింపు

పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి కాల్వ శ్రీరాంపూర్ వైపు వెళ్లే రహదారిపై డివైడర్ పక్కన అక్రమంగా నిలిపిన వాహనాలను ఎస్సై చంద్రకుమార్ తన సిబ్బందితో కలిసి తొలగించారు. రహదారులపై నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆటో, జీప్ యజమానులను హెచ్చరించారు.

ఆక్రమణలను తొలగించిన మున్సిపల్ అధికారులు

మున్సిపల్ కార్యాలయానికి వెళ్లే రహదారికి ఇరువైపులా కిరాణా దుకాణాల ముందు ఉన్న ఆక్రమణలను, రహదారిని ఆనుకుని ఏర్పాటు చేసిన పండ్ల దుకాణాలను మున్సిపల్ కమిషనర్ రమేష్ తన సిబ్బందితో కలిసి తొలగించారు. రోడ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలిగించవద్దని సూచించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ప్రజలు, వ్యాపారులు ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సహకరించాలని ఎస్సై చంద్రకుమార్ కోరారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, రహదారులపై వాహనాలను క్రమపద్ధతిలో నిలపాలని సూచించారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు కొనసాగిస్తామని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

జంతర్ మంతర్‌పై ఆంక్షలు ప్రజాస్వామ్య హక్కులకు విఘాతం







పెద్దపల్లి జిల్లా/ మంథని, అక్టోబర్ 14 (నిత్యం నిఘా ప్రతినిధి): ప్రజాస్వామ్యంలో ప్రజలు తమ సమస్యలను శాంతియుతంగా వ్యక్తం చేసేందుకు నిరసనలు తెలిపే హక్కు ఉందని మంథని 4వ వార్డు కౌన్సిలర్ ఎరుకల స్రవంతి రమేష్ బాబు అన్నారు. ఢిల్లీలో ప్రజాస్వామ్య నిరసనలకు వేదికగా ఉన్న జంతర్ మంతర్‌పై ఆంక్షలు విధించడం ప్రజల నిరసన హక్కులను పరిమితం చేయడమేనని ఆమె విమర్శించారు.ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లేందుకు శాంతియుతంగా నిరసనలు చేపట్టడం రాజ్యాంగం కల్పించిన హక్కు అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల గొంతుకకు ప్రాధాన్యత ఇవ్వాలని, తమ అభిప్రాయాలను వ్యక్తం చేసేందుకు తగిన అవకాశాలు కల్పించాలని కోరారు.కేంద్ర ప్రభుత్వం జంతర్ మంతర్‌పై విధించిన ఆంక్షలను పునఃసమీక్షించి, అక్కడ ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు తెలిపేందుకు అనుమతులు పునరుద్ధరించాలని ఎరుకల స్రవంతి రమేష్ బాబు డిమాండ్ చేశారు.

బతుకమ్మ పండుగను జాతరగా మార్చొద్దు.. తెలంగాణ సంస్కృతిని కాపాడాలి

- **డీజే మోతల్లో కనుమరుగవుతున్న సంప్రదాయ బతుకమ్మ పాటలు..**
- **పండుగ పవిత్రతను కాపాడుకోవాలని ఆధ్యాత్మిక పిలుపు**

(నిత్యం నిఘా స్పెషల్):తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతి ఆరాధనకు, ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీక బతుకమ్మ పండుగ. రంగురంగుల పూలను పేర్చి గౌరీదేవిని బతుకమ్మ రూపంలో కొలుస్తూ, సంప్రదాయ పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ భక్తి శ్రద్ధలతో జరుపుకునే ఈ పండుగలో ఆధునిక హంగుల పేరుతో సంప్రదాయాలకు దూరం కావడం ఆవేదన కలిగిస్తోంది. డీజే శబ్దాల హోరులో తెలంగాణ జానపద బతుకమ్మ పాటలు కనుమరుగు కాకుండా, పండుగ అసలైన వైభవాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

డీజే మోత కాదు.. సంప్రదాయ పాటలే ప్రధానంగా వినిపించాలి!

బతుకమ్మ అంటే కేవలం పూలను పేర్చి ఆడుకునే ఆట మాత్రమే కాదు. ప్రకృతిని పూజించే ఆచారం, గౌరీదేవిని ఆరాధించే భక్తిమార్గం, కుటుంబాల సుఖసంతోషాలను కోరుకునే పవిత్ర సందర్భం. మహిళలంతా ఒకచోట చేరి సంప్రదాయ పాటలు పాడుతూ బతుకమ్మ చుట్టూ ఆడుకోవడంలోనే ఈ పండుగ ప్రత్యేకత దాగి ఉంది.

కాలానుగుణంగా వేడుకల్లో మార్పులు రావడం సహజమే. అయితే ఆ మార్పుల పేరుతో పూర్వీకులు అందించిన సంస్కృతి, సంప్రదాయాలను విస్మరించడం సరికాదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. బతుకమ్మ డీజే పాటలకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఇతర వేడుకలను అనుకరించకుండా బతుకమ్మకు ప్రత్యేకమైన ఆటపాటలను కొనసాగించాలని సూచిస్తున్నారు. బతుకమ్మ పాటల్లో తెలంగాణ చరిత్ర, గ్రామీణ జీవన విధానం, ప్రకృతి అందాలు, మహిళల భావోద్వేగాలు ప్రతిబింబిస్తాయి. తరతరాలుగా పెద్దలు అందించిన ఈ సాంస్కృతిక సంపదను భావితరాలకు అందించాలంటే నేటి తరం సంప్రదాయాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఈరోజు మనం పాటించే ఆచారాలే రేపటి తరానికి మార్గదర్శకంగా నిలుస్తాయని గుర్తించాలి.

భక్తితో పూజిద్దాం.. బాధ్యతతో నిమజ్జనం చేద్దాం!

బతుకమ్మను గౌరీదేవి స్వరూపంగా భావించి భక్తితో పూజించడంతో పాటు, పండుగ ముగిసిన తర్వాత నిమజ్జనం విషయంలోనూ బాధ్యతగా వ్యవహరించాలి. చెరువులు, ఇతర జలవనరులు కలుషితం కాకుండా, ప్రకృతికి హాని కలగని విధంగా నిమజ్జనం నిర్వహించాలి. ప్రకృతిని ఆరాధించే పండుగలో ప్రకృతికే నష్టం కలగకుండా జాగ్రత్తపడటమే సంప్రదాయానికి నిజమైన గౌరవం.

మన పండుగను మనమే గౌరవించకపోతే మరెవరు గౌరవిస్తారు? మన సంస్కృతిని మనమే కాపాడుకోకపోతే భావితరాలకు



దానిని ఎవరు అందిస్తారు? అనే ప్రశ్న ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేయాలి.

సంప్రదాయమే మన బలం.. సంస్కృతే మన గౌరవం!

బతుకమ్మను కేవలం వినోద వేడుకగా కాకుండా భక్తి, ప్రకృతి ప్రేమ, మహిళల ఐక్యతకు ప్రతీకగా భావించాలి. సంప్రదాయాలను గుర్తుచేస్తూ ఎవరైనా సూచనలు చేస్తే వాటిని విమర్శగా కాకుండా సంస్కృతి పరిరక్షణకు చేసే ప్రయత్నంగా చూడాలి. వ్యక్తిగత అభిప్రాయాలకు అతీతంగా తెలంగాణ ఆడపడుచుల పండుగకు ఉన్న ప్రత్యేకతను కాపాడుకోవాలి.

బతుకమ్మ మన బతుకుకు ప్రతిబింబం.. మన సంప్రదాయానికి ప్రతీక.. తెలంగాణ ఆత్మగౌరవానికి చిరునామా. పూల పండుగలో భక్తి పరిమళాలు వెదజల్లాలి.. పాటల్లో తెలంగాణ సంస్కృతి ప్రతిధ్వనించాలి.. ఆటల్లో సంప్రదాయ వైభవం కనిపించాలి. అప్పుడే బతుకమ్మ పండుగ తన ప్రత్యేకతను నిలుపుకుంటూ భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుంది.

పల్లవి హైస్కూల్‌ను సందర్శించిన ఏసీపీ వెంకటేశ్వర్లు, సీఐ సంతోష్



వరంగల్ జిల్లా/ పర్వతగిరి, అక్టోబర్ 14(నిత్యం నిఘా ప్రతినిధి):పర్వతగిరి మండలం అన్నారం గ్రామంలోని పల్లవి హైస్కూల్‌ను ఏసీపీ వెంకటేశ్వర్లు, సీఐ సంతోష్, ఎస్సై ప్రవీణ్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల భవనాలు, విశాలమైన క్రీడా మైదానం, పచ్చని పరిసరాలు, ఆహ్లాదకరమైన విద్యా వాతావరణాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.



గ్రామీణ ప్రాంతంలో మెరుగైన విద్యా వసతులు

ఈ సందర్భంగా ఏసీపీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, నగరాల్లోని పాఠశాలకు దీటుగా గ్రామీణ ప్రాంతమైన అన్నారంలో పల్లవి హైస్కూల్‌ను తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. పాఠశాల భవన నిర్మాణం, విశాలమైన క్రీడా మైదానం, పరిశుభ్రమైన పరిసరాలు, ప్రశాంతమైన వాతావరణం ఆకట్టుకున్నాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇలాంటి వసతులతో కూడిన విద్యా వాతావరణాన్ని కల్పించడం అభినందించదగిన విషయమని అన్నారు.

ఎస్సై ప్రవీణ్‌కు ఘన సన్మానం

పర్వతగిరి మండలంలో గత కొన్ని సంవత్సరాలుగా ఎస్సైగా సేవలందించి, బదిలీపై వెళ్తున్న ప్రవీణ్‌ను పల్లవి హైస్కూల్ డైరెక్టర్ కోటగిరి రమేష్ శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. మండలంలో విధి నిర్వహణలో ఆయన అందించిన సేవలను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

పాఠశాలను సందర్శించిన అధికారులు అక్కడి వసతులు, విద్యార్థులకు అనుకూలమైన వాతావరణాన్ని పరిశీలించి పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు.

ఈ కార్యక్రమంలో అన్నారం గ్రామ సర్పంచ్ గాడిపెల్లి మహేందర్, మార్కెట్ డైరెక్టర్ గొడుగు భిక్షపతి, గ్రామ వార్డు సభ్యులు రామకృష్ణ, నాగరాజు, రాజబాబు, అనిత, రవి, గ్రామ పెద్దలు, యువజన నాయకులు బాల్యవృద్ధి గౌడ్, మణికంఠతో పాటు ఇతర యువజన నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నరకాసుర వధ ఉత్సవాలకు ఎమ్మెల్యే కొండా సురేఖ సహకారం కోరుతాం

వరంగల్, అక్టోబర్ 14 (నిత్యం నిఘా ప్రతినిధి): దీపావళి పండుగ సందర్భంగా నవంబర్ 6న ఉర్సు గుట్ట మైదానంలో నిర్వహించనున్న నరకాసుర వధ ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు వరంగల్ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే కొండా సురేఖ మురళీధర్ రావు సహకారం తీసుకుంటామని నరకాసుర వధ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మరుపల్ల రవి తెలిపారు.

బుధవారం ఉర్సు ప్రతాప్ నగర్‌లో నిర్వహించిన ఉత్సవ కమిటీ కార్యవర్గ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. నరకాసుర వధ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వ సహకారం అవసరమని పేర్కొన్నారు. ఉత్సవాలకు అవసరమైన ఏర్పాట్లపై ఎమ్మెల్యే కొండా సురేఖతో పాటు వరంగల్ మహానగర పాలక సంస్థ చైర్‌పర్సన్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్లు సత్య శారద, చాహత్ బాజ్‌పాయ్, వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

ఆర్థిక సహకారానికి దాతలు ముందుకు రావాలి

ఉత్సవాల నిర్వహణకు అవసరమైన ఆర్థిక వనరులు సమకూరక కమిటీ ఇబ్బందులు ఎదుర్కొంటోందని మరుపల్ల రవి అన్నారు. గత సంవత్సరం నిర్వహించిన ఉత్సవాలకు రూ.29 వేల లోటు బడ్జెట్ ఏర్పడిందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో నరకాసుర వధ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకరించాలని కోరారు.



అలాగే నరకాసుర వధ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దీపావళి పరపతి సంఘాన్ని ఏర్పాటు చేసుకోవాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు.

సమావేశంలో పాల్గొన్న కమిటీ సభ్యులు

ఈ సమావేశంలో ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల రవి, కోశాధికారి మరుపల్ల గౌతమ్, ఉపాధ్యక్షులు దూడె బాల, కొమురెల్లి, సహాయ కార్యదర్శులు వనం కుమార్, ఆవునూరి రామన్న, శెట్టి మోహన్, కార్యనిర్వాహక కార్యదర్శులు తవుటం నరసింహ, కాటం సతీష్, ఆర్గనైజర్లు కుండె రాజు, ఆవునూరు ఐలేశం, కార్యవర్గ సభ్యులు పోలం రంజిత్, కుండె సదానందం, గౌడ కోటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

బదిలీపై వెళ్తున్న ఎస్సై భోగం ప్రవీణ్ కుమార్‌కు ఘన సన్మానం



వరంగల్ జిల్లా/ పర్వతగిరి, అక్టోబర్ 14 (నిత్యం నిఘా ప్రతినిధి):పర్వతగిరి మండలంలో రెండున్నరేళ్ల పాటు ఎస్సైగా విధులు నిర్వహిస్తూ, మండల పరిధిలోని 33 గ్రామాల ప్రజలకు విశేష సేవలందించిన భోగం ప్రవీణ్ కుమార్ బదిలీపై వెళ్తున్న సందర్భంగా అన్నారం గ్రామ ప్రజాప్రతినిధులు ఆయనను ఘనంగా సన్మానించారు.
ఈ సందర్భంగా అన్నారం గ్రామ సర్పంచ్ గాడిపెల్లి మహేందర్ గౌడ్, ఉపసర్పంచ్ గొడుగు ఏకాంత సారయ్య, ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ గొడుగు బిక్షపతి తదితరులు ఎస్సై ప్రవీణ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు.

ప్రజాసేవలో అంకితభావం

పర్వతగిరి మండలంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల సమస్యల పరిష్కారానికి ఎస్సై ప్రవీణ్ కుమార్ అందించిన సేవలను ప్రజాప్రతినిధులు అభినందించారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ ప్రజల మన్ననలు పొందారని కొనియాడారు. బదిలీపై వెళ్తున్న ఆయన నూతన బాధ్యతల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో రాపోలు అనిత, రవీందర్, భాషబోయిన రామకృష్ణ, ముంజంపల్లి నాగరాజు, కొండేటి కొమరమ్మ, రామచందర్, దొంతమాల పవన్ కళ్యాణ్, గ్రామపంచాయతీ కార్యదర్శి నిర్మల రాజు తదితరులు పాల్గొన్నారు.

రంగశాయిపేటలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



వరంగల్, అక్టోబర్ 14 (నిత్యం నిఘా ప్రతినిధి):వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 42వ డివిజన్ కాపువాడ గడి సెంటర్‌లో విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు విద్యుత్ అధికారులు నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. పాత ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా విద్యుత్ వోల్టేజీలో హెచ్చుతగ్గులు ఏర్పడుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఈ చర్య చేపట్టారు.

మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు

గడి సెంటర్‌లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి, స్థానిక ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. రంగశాయిపేట ప్రాంతంలో విద్యుత్ సమస్యలు పునరావృతం కాకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపడతామని డీఈ మల్లికార్జున్, ఏఈతో పాటు విద్యుత్ అధికారులు తెలిపారు.
ప్రజలకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

పంచాయతీరాజ్ అభివృద్ధి పనులపై సమీక్ష

- **అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయాలి: ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు**



భద్రాచలం, అక్టోబర్ 14 (నిత్యం నిఘా ప్రతినిధి):భద్రాచలంలోని హరిత హోటల్‌లో బుధవారం నిర్వహించిన భద్రాచలం నియోజకవర్గ స్థాయి పంచాయతీరాజ్ శాఖ అభివృద్ధి పనుల సమీక్షా సమావేశంలో భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సమావేశంలో VB–GRAM G, EL NINO, JALASIRI, SBM తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులు అర్హులైన ప్రజలకు సక్రమంగా చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. అభివృద్ధి కార్యక్రమాల అమలులో నిర్దేశిత లక్ష్యాలను సాధించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో నియోజకవర్గ స్థాయి పంచాయతీరాజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఆదివాసీల హక్కుల సాధనకు హైదరాబాద్‌లో మహాధర్నా



హైదరాబాద్, అక్టోబర్ 14 (నిత్యం నిఘా ప్రతినిధి): ఆదివాసీల హక్కుల పరిరక్షణ, ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన చట్టాల అమలు తదితర డిమాండ్ల సాధన కోసం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ఆదివాసీల ఆత్మఘోష మహాధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ఆధ్వర్యంలోని ఐక్య వేదిక సమావేశంలో వాజేడు, వెంకటాపురం మండలాలకు చెందిన ఆదివాసీ నాయకులు పాల్గొని తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.

ఆదివాసీల ప్రధాన డిమాండ్లు

1/70 చట్టంపై గిరిజనేతరులు సుప్రీంకోర్టులో దాఖలు చేసిన కేసులో ఆదివాసీల పక్షాన రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కౌంటర్ పిటిషన్ దాఖలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. జీవో నంబర్ 3 స్థానంలో మరో కొత్త జీవో తీసుకువచ్చేందుకు ఎమ్మెల్యేలు, ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ తీర్మానం చేసి ఆదివాసీలకు న్యాయం చేయాలని కోరారు.
రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఆదివాసీలు సాగు చేస్తున్న ఎనిమిది లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, పీసా చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అమలులో ఉన్న చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

హక్కుల కోసం ఉద్యమం ఉధృతం చేస్తాం

ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీల హక్కులు, చట్టాల అమలు విషయంలో నిర్లక్ష్యం కొనసాగితే చూస్తూ ఊరుకోబోమని నాయకులు హెచ్చరించారు. తమ డిమాండ్ల పరిష్కారం కోసం అవసరమైతే బలమైన ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో వాజేడు, వెంకటాపురం మండలాలకు చెందిన ఆదివాసీ నాయకులు ఎట్టి విద్యాసాగర్, పూనెం సాయి, పాయం అజయ్, పూనెం ప్రతాప్, వెంకటకృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వంట కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలి



ములుగు జిల్లా , అక్టోబర్ 14 (నిత్యం నిఘా ప్రతినిధి): మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న వంట కార్మికుల సుదీర్ఘ సేవలను గుర్తించి, వారి న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ డిమాండ్ చేశారు. వంట కార్మికుల ఉపాధిని దెబ్బతీసే సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని విరమించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.
ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం ములుగు ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షురాలు గున్నాల రాజకుమారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జంపాల రవీందర్ మాట్లాడుతూ, పాఠశాలల్లో విద్యార్థులకు వంటలు చేస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం గుర్తించాలని అన్నారు.

ఉద్యోగ భద్రత, వేతన సవరణ కల్పించాలి

వంట కార్మికులతో ప్రభుత్వం చర్చలు జరిపి ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా వేతనాలను సవరించాలని రవీందర్ కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సెంట్రలైజ్డ్ కిచెన్ విధానం వల్ల వంట కార్మికులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అల్పాహార పథకాన్ని కూడా వంట కార్మికుల ద్వారానే నిర్వహించాలని కోరారు.
హరే రామ–హరే కృష్ణ ఫౌండేషన్ ద్వారా అల్పాహారం అందిస్తేనే నాణ్యత మెరుగ్గా ఉంటుందనే అభిప్రాయం సరైనది కాదని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన సూచనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు.

ఈ నెల 28న ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాల ముట్టడి

వంట కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 28న రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాల ముట్టడి కార్యక్రమం నిర్వహించనున్నట్లు రవీందర్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.
ఈ సమావేశంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం భారతి, ఉపాధ్యక్షురాలు పోరెడ్డి ప్రమీల, జిల్లా కమిటీ సభ్యులు కమలక్క, సరోజన, భారతి, శ్రీలత, సమ్మక్క, సునీత, సుమలత తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళీ అమ్మవారు మహాలక్ష్మిగా దివ్యదర్శనం

- **నాలుగో రోజు వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు.. సూర్యప్రభ, హంస వాహనాలపై అమ్మవారి ఊరేగింపు**
- **తొగుట పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి సందర్శన.. భక్తులకు విశేష పూజలు, అన్నదానం**



హనుమకొండ/భద్రకాళీ ఆలయం , అక్టోబర్ 14 (నిత్యం నిఘా ప్రతినిధి): కాకతీయుల రాజధానిగా, ఏకశిలానగరంగా చరిత్ర ప్రసిద్ధిగాంచిన వరంగల్ శ్రీ భద్రకాళీ దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాలు నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా బుధవారం అమ్మవారిని మహాలక్ష్మి గా అలంకరించి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.
నవరాత్రుల్లో మహాలక్ష్మి రూపంలో అమ్మవారిని దర్శించుకోవడం వల్ల అష్టైశ్వర్యాలు, సకల సంపదలు సిద్ధిస్తాయని భక్తుల విశ్వాసం. నవదుర్గా కల్పోక్త నవరాత్రి పూజా విధానాన్ని అనుసరించి అమ్మవారికి కూష్మాండీ, గిరిజా క్రమాల్లో పూజారాధనలు నిర్వహించారు. అనాహత చక్రంలో మనస్సును స్థిరపరచుకుని పవిత్రమైన భావనతో కూష్మాండా దేవిని ధ్యానించడం ద్వారా దుష్టశక్తులు దూరమై, భక్తులకు శుభాలు కలుగుతాయని ఆలయ అర్చకులు వివరించారు. గిరిజా క్రమంలో అమ్మవారిని ఆరాధించడం వల్ల సకల సౌభాగ్యాలు కలుగుతాయని తెలిపారు.
ఉదయం సూర్యప్రభ వాహనంపై సావిత్రి మాతగా, సాయంత్రం హంస వాహనంపై బ్రాహ్మీ మాతగా అమ్మవారిని అలంకరించి ఊరేగించారు. సూర్యప్రభ వాహనంపై సావిత్రి మాతగా దర్శనమిచ్చిన అమ్మవారిని పూజించడం ద్వారా భక్తుల్లో ధర్మంపై విశ్వాసం పెరుగుతుందని, హంస వాహనంపై బ్రాహ్మీ మాతగా దర్శనమివ్వడం వల్ల మేధాశక్తి, మంచి చెడులను గుర్తించే విచక్షణ కలుగుతాయని ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు తెలిపారు.

తొగుట పీఠాధిపతి ప్రత్యేక పూజలు

తొగుట పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి బుధవారం భద్రకాళీ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి రామల సునీత, ప్రధానార్చకులు భద్రకాళి శేషు పూర్ణకుంభంతో స్వామివారికి ఘనస్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ మహామండపంలో భక్తులను ఉద్దేశించి స్వామివారు అనుగ్రహ భాషణం చేశారు. ఆలయంలో నిర్మిస్తున్న నూతన రథాన్ని కూడా పరిశీలించారు.

భక్తులకు అన్నదానం.. సాంస్కృతిక కార్యక్రమాలు

ఉత్సవాల్లో భాగంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక క్యూలైన్లు, మంచినీటి సౌకర్యం, మధ్యాహ్న భోజన ఏర్పాట్లను కార్యనిర్వహణాధికారి రామల సునీత పర్యవేక్షించారు. శ్రీ భద్రకాళీ సేవా సమితి కన్వీనర్ అయితా గోపీనాథ్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం, రాత్రి భక్తులకు అన్నదానం నిర్వహించారు.
సాయంత్రం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో హరికథ, భక్తి సంగీతం, కర్ణాటక సంగీతం, కూచిపూడి నృత్య ప్రదర్శనలు భక్తులను విశేషంగా అలరించాయి.
బుధవారం ఉత్సవాలకు గండ్ర భూపాల్ రెడ్డి–రూపా దంపతులు, గండ్ర అభిలాష్ రెడ్డి–దివ్య దంపతులు, గండ్ర సాయికృష్ణారెడ్డి–భావనాంజలి దంపతులు, అనసూరి శ్రీనివాస్–బాలజనని దంపతులు, అట్టం శంతన్ పటేల్–శ్రీగంధ దంపతులు, ముప్పిడి సుధీర్ రెడ్డి–అర్పిత తదితరులు ఉభయదాతలుగా వ్యవహరించారు. పూజల అనంతరం వారికి శేషవస్త్రాలు అందజేసి, ప్రసాదాలు సమర్పించారు.

నేనెప్పుడూ పాలకుడిని కాదు.. ప్రజా సేవకుడినే

- **ప్రజల సమస్యల పరిష్కారమే నా లక్ష్యం.. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**



హనుమకొండ, అక్టోబర్ 14 (నిత్యం నిఘా ప్రతినిధి):"నేనెప్పుడూ పాలకుడిని కాదు.. ప్రజా సేవకుడినే. ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి ప్రజల్లోనే ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నా. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు నా శిబిర కార్యాలయం తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి" అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.

వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 31, 50వ డివిజన్ల పరిధిలో ఉన్న దీన్‌దయాళ్ నగర్‌లో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న సమాజ భవనానికి బుధవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో కాలనీ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.

శాయంపేట డివిజన్‌లో గత మూడేళ్లుగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామీణ వాతావరణం కలిగిన శాయంపేట డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. గతంలో ఈ ప్రాంతంలోని కొన్ని కాలనీలకు ఎమ్మెల్యేలు సైతం పర్యటించని పరిస్థితి ఉండేదని, తాను ఎన్నికైనప్పటి నుంచి ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని పేర్కొన్నారు.

ఇప్పటికే పలు కాలనీల్లో అంతర్గత రహదారులు, మురుగు నీటి కాలువల అభివృద్ధి పనులను చేపట్టి పూర్తి చేశామని వివరించారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూ.5 లక్షల ఆర్థిక సాయం అందేలా కృషి చేశామని తెలిపారు. ఇంకా ఇళ్లు మంజూరు కావాల్సిన అర్హులైన లబ్ధిదారులు ఉన్నారని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రానున్న రోజుల్లో అర్హులందరికీ ఇళ్ల మంజూరయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి హామీ

సమావేశంలో కాలనీ ప్రజలు పలు స్థానిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన కొన్ని సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి అక్కడికక్కడే చర్యలు తీసుకోవాలని సూచించారు. మిగిలిన సమస్యలను కూడా ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులు చేపట్టడమే తన లక్ష్యమని నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి మార్క విజయ్, మాజీ కార్పొరేటర్లు మామిండ్ల రాజు, నెక్కొండ కవిత కిషన్, డివిజన్ అధ్యక్షుడు సత్తు రమేష్, మాజీ అధ్యక్షుడు సురేందర్, స్థానిక కాలనీ నాయకులు అశోక్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ కలెక్టరేట్‌లో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

- **తీరొక్క పూలతో బతుకమ్మలు.. ఆటపాటలు, కోలాటాలతో మహిళా ఉద్యోగుల సందడి**
- **తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీక:కలెక్టర్ సత్య శారదాదేవి**





వరంగల్, అక్టోబర్ 14 (నిత్యం నిఘా ప్రతినిధి):వరంగల్ జిల్లా కలెక్టరేట్ ఆవరణలో బుధవారం బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. తెలంగాణ ఉద్యోగుల సంఘం, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు జిల్లా కలెక్టర్ సత్య శారదాదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన మహిళా ఉద్యోగినులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఉత్సాహంగా పాల్గొన్నారు. బతుకమ్మ పాటలు, కోలాటాలు, నృత్యాలతో కలెక్టరేట్ ఆవరణ సందడిగా మారింది.

ఈ సందర్భంగా కలెక్టర్ సత్య శారదాదేవి మాట్లాడుతూ భాద్రపద మాసం అమావాస్య నుంచి తొమ్మిది రోజుల పాటు మహిళలు గౌరమ్మను కొలుస్తూ బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో పండుగను జరుపుకుంటారని తెలిపారు. తమ కష్టసుఖాలను పంచుకుంటూ ప్రేమ, స్నేహం, బంధుత్వం, ఆప్యాయతలను చాటుకునే గొప్ప సంప్రదాయం బతుకమ్మ పండుగలో ఉందన్నారు. ప్రకృతిలో సహజంగా లభించే పూలనే దేవతగా భావించి పూజించడం తెలంగాణ సంస్కృతిలోని ప్రత్యేకత అని పేర్కొన్నారు. జిల్లా నలుమూలల నుంచి వివిధ శాఖల మహిళా ఉద్యోగినులు తరలివచ్చి ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. నిత్య ఉద్యోగ బాధ్యతల మధ్య ఇలాంటి వేడుకలు సంతోషాన్ని, ఉత్సాహాన్ని అందిస్తాయని తెలిపారు.

తెలంగాణ అస్తిత్వానికి ప్రతీక బతుకమ్మ

జిల్లా తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్, తెలంగాణ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గాజే వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా కలెక్టరేట్‌లో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించామని తెలిపారు. ఉత్సవాల్లో పాల్గొన్న మహిళా ఉద్యోగినులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణలోని వివిధ వర్గాల ప్రజలకు జీవనోపాధి కల్పించడంలోనూ బతుకమ్మ పండుగకు ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు.

తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఫణికుమార్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, అస్తిత్వానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. మహిళలు తమ సంప్రదాయాలను చాటి చెప్పేలా ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొంటున్నారని తెలిపారు. చివరి రోజు సద్దుల బతుకమ్మను ఘనంగా నిర్వహించుకుంటారని పేర్కొంటూ మహిళా ఉద్యోగులందరికీ శుభం కలగాలని ఆకాంక్షించారు.

అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకుల హాజరు

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కిషోర్ కుమార్, గణేష్, జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి , రెవెన్యూ డివిజనల్ అధికారులు సుమ, ఉమారాణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజారెడ్డి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వసంత, జిల్లా పంచాయతీ అధికారి కల్పన, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బాలాజీ పాల్గొన్నారు. అలాగే తెలంగాణ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి పాలకుర్తి సదానందం, గౌరవ అధ్యక్షుడు గజ్జల రాంకిషన్, కోశాధికారి కిరణ్ కుమార్, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గనిపాక రాజ్‌కుమార్, రాష్ట్ర సహాయ అధ్యక్షుడు రియాజుద్దీన్, నగర అధ్యక్షుడు శెంకేషి రాజేష్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సాంబయ్య, కార్యదర్శి భాను, ఉద్యోగ సంఘాల నాయకులు గద్దల రాజు, ఇంద్రసేనారెడ్డి, వంశీధర్, బత్తిని రమాదేవి, సునీత నాయర్, రవికుమార్, జోసఫ్, అర్జున్, చిరంజీవి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

టెక్నాలజీని మనం వాడాలి.. టెక్నాలజీ మనల్ని వాడకూడదు

- **డిజిటల్ వినియోగంపై అవగాహన కలిగి ఉండాలి.. కుటుంబంతో గడిపేందుకు సమయం కేటాయించాలి: పంచాయతీ కార్యదర్శి నరేష్**



ములుగు జిల్లా/వాజేడు, అక్టోబర్ 14 (నిత్యం నిఘా ప్రతినిధి): మొబైల్ ఫోన్లు, అంతర్జాలాన్ని అవసరానికి అనుగుణంగా ఉపయోగించుకోవాలని, వాటికి అతిగా అలవాటు పడకూడదని కృష్ణాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శి కుర్సం నరేష్ సూచించారు. "టెక్నాలజీని మనం వాడాలి.. టెక్నాలజీ మనల్ని వాడకూడదు" అని పిలుపునిచ్చారు.ములుగు జిల్లా వాజేడు మండలం కృష్ణాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని కడేకల్ గ్రామంలో కాపేడు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం డిజిటల్ డిటాక్స్ డే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ మొబైల్ ఫోన్లు, అంతర్జాలం నేటి జీవితంలో ఎంతో ఉపయోగకరమైనప్పటికీ, వాటిని అవసరానికి మించి వినియోగించడం వల్ల కుటుంబ సభ్యులతో గడిపే సమయం తగ్గడంతోపాటు పిల్లల చదువు, ఆటలు, ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు.ప్రతిరోజూ కొంత సమయం మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంటూ కుటుంబ సభ్యులతో మాట్లాడటం, పిల్లలతో ఆటలు ఆడటం, పుస్తకాలు చదవడం, ప్రకృతిని ఆస్వాదించడం అలవాటు చేసుకోవాలని సూచించారు. గ్రామంలోని ప్రతి కుటుంబం వారానికి కనీసం ఒకరోజు లేదా ప్రతిరోజూ కొంత సమయం 'మొబైల్ రహిత సమయం'గా పాటించాలని పిలుపునిచ్చారు.డిజిటల్ సాంకేతికత మన జీవితాలను సులభతరం చేయడానికి ఉపయోగపడాలి తప్ప, దానికి మనం బానిసలు కాకూడదని అన్నారు. కుటుంబ సభ్యుల ఆరోగ్యం, ఆనందం కోసం ప్రతి ఒక్కరూ నేటి నుంచే డిజిటల్ డిటాక్స్‌ను అలవాటు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వాజేడు మండల సమన్వయకర్త గొంది కామేష్‌రావు, పొడెం స్వరూప, రమాదేవి, ప్రసాద్, గ్రామ పెద్ద రామచంద్రమూర్తి, ఆశా కార్యకర్తలు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తాడ్వాయి ఎంపీడీవో కార్యాలయంలో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

- **పార్టీలకు అతీతంగా సర్పంచుల భాగస్వామ్యం.. ఐకమత్యానికి ప్రతీకగా వేడుకలు**



ములుగు జిల్లా/తాడ్వాయి, అక్టోబర్ 14 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు తాడ్వాయి మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో రంగుబట్ల తేజ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులను పార్టీలకు అతీతంగా ఆహ్వానించారు. ప్రజాప్రతినిధులంతా కలిసికట్టుగా పాల్గొని బతుకమ్మ సంబరాలను ఉత్సాహంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా ఎంపీడీవో రంగుబట్ల తేజ మాట్లాడుతూ తెలంగాణలో బతుకమ్మ పండుగకు ఎంతో విశిష్టమైన ప్రాధాన్యత ఉందన్నారు. మహిళలు సంప్రదాయబద్ధంగా జరుపుకునే ఈ పండుగ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో పండుగలను జరుపుకోవాలని సూచించారు. పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధులందరినీ ఒకచోట చేర్చి బతుకమ్మ వేడుకలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. మండల ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, ఇలాంటి వేడుకలు ఐక్యతను మరింత పెంపొందించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం అధ్యక్షుడు దిడ్డి మోహన్‌రావు, సర్పంచుల ఫోరం జిల్లా కార్యదర్శి మొగిలిపల్లి రవీందర్, రాజా, విజయభారతి, నాగభూషణంతో పాటు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులు పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలి

- బతుకమ్మ మన అస్తిత్వానికి ప్రతీక





హనుమకొండ, అక్టోబర్ 14 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. తెలంగాణ అస్తిత్వానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తూ, దాని గొప్పతనాన్ని రాబోయే తరాలకు తెలియజేయాలని పిలుపునిచ్చారు.హనుమకొండ జిల్లా తెలంగాణ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఐడీఓసీ సముదాయ ఆవరణలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తన సతీమణి నాయిని నీలిమా రాజేందర్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, వరుణ్ రెడ్డి ఐఏఎస్, జాయింట్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్లు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం ప్రభుత్వ ఉద్యోగులు ఉత్సాహంగా, వినూత్న ఆలోచనలతో బతుకమ్మ సంబరాలను నిర్వహించడం సంతోషకరమన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు తమ శాఖల ప్రత్యేకతలను ప్రతిబింబించేలా బతుకమ్మలను రూపొందించి తీసుకురావడం అభినందనీయమని తెలిపారు.బతుకమ్మ పండుగ మహిళలకు చిన్ననాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేస్తూ, కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా గడిపే అపూర్వమైన అవకాశాన్ని కల్పిస్తుందని అన్నారు. పుట్టింటికి వెళ్లి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో ఆనందంగా సమయం గడపడం ఈ పండుగలోని ప్రత్యేకతగా పేర్కొన్నారు.తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని నాయిని రాజేందర్ రెడ్డి ఆకాంక్షించారు. వేడుకల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ఆసుపత్రిలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రవీందర్‌కు ఎమ్మెల్యే నాగరాజు పరామర్శ



వరంగల్/పర్వతగిరి, అక్టోబర్ 14 (నిత్యం నిఘా ప్రతినిధి): పర్వతగిరి మండలం వడ్లకొండ గ్రామానికి చెందిన ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు నరకుడు రవీందర్ హనుమకొండలోని ఏకశిల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ఆయనను పరామర్శించారు. హనుమకొండ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కేఆర్ దిలీప్ రాజ్‌తో కలిసి బుధవారం ఆసుపత్రికి వెళ్లి రవీందర్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా వైద్యులతో మాట్లాడి రవీందర్‌కు అందుతున్న చికిత్స వివరాలను తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించి ఆయన త్వరగా కోలుకునేలా చూడాలని వైద్యులకు సూచించారు. రవీందర్ సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజాసేవలో పాల్గొనాలని ఆకాంక్షించారు.అనంతరం రవీందర్ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. ప్రజలకు, పార్టీ శ్రేణులకు అండగా ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకోవడం తన బాధ్యత అని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు ఇస్లావత్ సావిత్రి, కల్లెడ సహకార సంఘం చైర్మన్ పిన్నింటి అనిల్ రావు, చౌటపల్లి సహకార సంఘం చైర్మన్ పత్తి కుమార స్వామి, వడ్లకొండ సర్పంచ్ అభ్యర్థి అనిల్, మండల మహిళా అధ్యక్షురాలు సువార్త, సహకార సంఘం డైరెక్టర్లు బొట్ల మహేంద్ర, అబర్ల రవి, నాయకులు చౌడ సుధాకర్, ప్రమోద్, సుల్తానియ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ రికార్డుల్లో అక్రమాల ఆరోపణ



పెద్దపల్లి జిల్లా / మంథని, అక్టోబర్ 14 (నిత్యం నిఘా ప్రతినిధి):బతికున్న వ్యక్తిని రెవెన్యూ రికార్డుల్లో మరణించినట్లుగా చూపించి, తప్పుడు వారసత్వ నివేదిక సమర్పించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మంథని రెవెన్యూ అధికారి అనిల్ కుమార్ వ్యవహారం మరో మలుపు తిరిగింది. ఈ వ్యవహారంపై నిర్వహించిన విచారణ అనంతరం ఆయనను భూపరిపాలన ప్రధాన కమిషనర్ కార్యాలయానికి సరెండర్ చేసినట్లు అధికారిక వర్గాల సమాచారం. అయితే ఈ చర్యకు సంబంధించిన అధికారిక ఉత్తర్వులు, పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది.

అదనపు కలెక్టర్ విచారణలో ఏమైంది?

విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఈ వ్యవహారంలో గతంలోనే సస్పెన్షన్‌కు గురైన అనిల్ కుమార్‌పై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అదనపు కలెక్టర్ సమగ్ర విచారణ నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా తప్పుడు నివేదిక సమర్పించినట్లు విచారణలో గుర్తించినట్లు సమాచారం. విధి నిర్వహణలో నిర్లక్ష్యం, సమీక్షలు, అంతర్గత విచారణల సమయంలో క్రమశిక్షణారాహిత్యంగా వ్యవహరించిన అంశాలను కూడా నివేదికలో ప్రస్తావించినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

జిల్లా యంత్రాంగం కీలక నిర్ణయం?

విచారణ నివేదికను పరిశీలించిన జిల్లా కలెక్టర్, సదరు ఉద్యోగి సేవలు జిల్లాకు అవసరం లేదనే అభిప్రాయంతో ఆయనను భూపరిపాలన ప్రధాన కమిషనర్ కార్యాలయానికి సరెండర్ చేస్తూ ఉన్నతాధికారులకు నివేదించినట్లు సమాచారం. ఈ పరిణామంపై మంథని రెవెన్యూ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రజల భూములు, వారసత్వ హక్కులకు సంబంధించిన రెవెన్యూ రికార్డుల నిర్వహణలో పారదర్శకత, బాధ్యత అత్యంత కీలకం. బతికున్న వ్యక్తిని రికార్డుల్లో మరణించినట్లుగా చూపించారనే ఆరోపణలు నిజమైతే, దాని వెనుక ఉన్న కారణాలు, బాధ్యుల పాత్రపై పూర్తిస్థాయి స్పష్టత రావాల్సిన అవసరం ఉంది. ఈ వ్యవహారంపై అధికారిక ఉత్తర్వులు వెలువడితేనే చర్యల స్వరూపం, తదుపరి పరిణామాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

చిన్నారి మెడలోని బంగారు హనుమాన్ లాకెట్ చోరీ కేసు ఛేదన

- సీసీఎస్, పట్టణ పోలీసుల సంయుక్త దర్యాప్తు..
  భార్యాభర్తల గుర్తింపు



భూపాలపల్లి, అక్టోబర్ 14 (నిత్యం నిఘా ప్రతినిధి):): భూపాలపల్లి పట్టణంలో చిన్నారి మెడలోని బంగారు హనుమాన్ లాకెట్ చోరీకి గురైన కేసును సీసీఎస్, పట్టణ పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు చేసి ఛేదించారు. నిఘా కెమెరాల దృశ్యాలను పరిశీలించి నాచారానికి చెందిన మంజు కవిత, ఆమె భర్త శ్రీధర్‌ను గుర్తించినట్లు పోలీసులు వెల్లడించారు. భూపాలపల్లి పట్టణంలోని మైసమ్మ కాలనీకి చెందిన జరుపుల బాలాజీ ఈ నెల 11వ తేదీ సాయంత్రం తన భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి కాసం ఫ్యాషన్ మాల్‌కు షాపింగ్‌కు వెళ్లారు. ఇంటికి తిరిగి వచ్చిన అనంతరం మరుసటి రోజు ఉదయం చిన్నారి మెడలో ఉండాల్సిన బంగారు హనుమాన్ లాకెట్ కనిపించకపోవడాన్ని గుర్తించారు. చిన్నారి మెడపై గోళ్లతో గీరినట్లుగా గుర్తులు కనిపించడంతో అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు భూపాలపల్లి పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీసీఎస్, పట్టణ పోలీసులు సంయుక్తంగా నిఘా కెమెరాల దృశ్యాలను క్షుణ్ణంగా పరిశీలించి నిందితులను గుర్తించారు. విచారణలో చిన్నారి మెడలోని బంగారు హనుమాన్ లాకెట్‌ను దొంగిలించినట్లు వారు అంగీకరించారని పోలీసులు తెలిపారు. ఈ కేసులో తదుపరి చట్టపరమైన చర్యలు కొనసాగుతున్నాయి.ఈ సందర్భంగా భూపాలపల్లి పట్టణ పోలీస్ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్. శ్రీనివాస్ మాట్లాడుతూ, షాపింగ్ మాళ్లు, మార్కెట్లు, ఇతర రద్దీ ప్రాంతాలకు వెళ్లినప్పుడు తల్లిదండ్రులు చిన్నపిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిన్నారులకు బంగారు ఆభరణాలు ధరింపజేసే విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా లేదా దొంగతనం జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి

- నిందితుల అరెస్టులు, సాక్ష్యాధారాల సేకరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా పటిష్ఠ భద్రత..నేర సమీక్షలో పోలీసు అధికారులకు ఆదేశాలు



వరంగల్, అక్టోబర్ 14 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నిందితులను త్వరితగతిన అరెస్టు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. కేసుల దర్యాప్తులో నాణ్యతతో పాటు వేగానికి ప్రాధాన్యమివ్వాలని, ప్రజలకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో బుధవారం డీసీపీలు, ఏసీపీలు, వివిధ పోలీస్ స్టేషన్ల అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. కమిషనరేట్ పరిధిలో నమోదైన నేరాలు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, నిందితుల అరెస్టులు, సాక్ష్యాధారాల సేకరణ, న్యాయస్థానాల్లో కేసుల పురోగతి తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు.దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను గుర్తించి, వాటి దర్యాప్తు ఏ దశలో ఉందో సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిందితులు పరారీలో ఉన్న కేసుల్లో వారి ఆచూకీ గుర్తించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని, అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి వారిని త్వరగా అరెస్టు చేయాలని సూచించారు. దర్యాప్తులో జాప్యం జరగకుండా ప్రతి కేసుకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని ముందుకు సాగాలని ఆదేశించారు.మహిళలు, చిన్నారులపై నేరాలు, ఆస్తి నేరాలు, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలకు సంబంధించిన కేసులు, తీవ్రమైన నేరాల దర్యాప్తుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతి కేసును పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా దర్యాప్తు చేయాలని స్పష్టం చేశారు.ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ నేరాల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, నేరాలకు పాల్పడే వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు.రానున్న బతుకమ్మ, దసరా పండుగలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకునేలా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంతో పాటు ముమ్మర గస్తీ నిర్వహించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, అదనపు డీసీపీలు రాయల ప్రభాకర్‌రావు, హనుమకొండ ఏసీపీ నర సింహారావు, కాజీపేట ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి, పలువురు పోలీస్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఐటీ కోర్ అధికారులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Bura Nagesh Goud, on behalf of Amulya Publications & Printers Graphics, Editor - Bura Nagesh Goud, is responsible for news selection under PRB act prgi.gov.in RNI. TGTEL/25/A1665, # 5-11-1014/A, Naim Nagar, Hanamkonda, Warangal, Telangana, India - 506009, Cell : 9441974025, 9440170543 Email:nityamnigha.acs@gmail.com